క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్‌సీపీడీసీఎల్–11 కేవీ ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటలకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్న ఏడీఈ విజయభాస్కర్ ప్రకటించారు. ప్లేగ్రౌండ్ ఫీడర్ పరిధిలో బుర్జుగల్లి, కుమ్మరివాడి, ఎరుకలబస్తీ, గాంధీబొమ్మ, వాణి ఫోటో స్టూడియో తదితర ప్రాంతాల్లో 9.30 నుంచి 12 గంటల వరకు, హర్రాజ్‌పెంట ఫీడర్ పరిధిలో హర్రాజ్‌పెంట, సుందర్‌నగర్, శ్యామ్‌నగర్, కృష్ణానగర్, గ్యాస్‌మండి, నెహ్రూనగర్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

దివ్యాంగులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో దివ్యాంగులకు ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేయాలని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్‌ది డెఫ్ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్‌గౌడ్‌లు తెలిపారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలో వల్లభనేని మాట్లాడుతూ.. దివ్యాంగులు, బధిరులకు చదువుతో నిమిత్తం లేకుండా ఉచితంగా త్రీజీ మొబైల్, మూడు చక్రాల మోటర్ వాహనాలను పంపిణీ చేయాలని కోరారు. ప్రభుత్వ శాఖలో ఖాళీగా ఉన్న దివ్యాంగుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు.

వీధిలైట్లకు మరమ్మతులు



మరమ్మతులు చేయిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్

కాచిగూడ: బర్కత్‌పుర బస్‌డిపో లేన్‌లో గత కొంత కాలంగా వీధి దీపాలు పనిచేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్ మంగళవారం జీహెచ్‌ఎంసీ సిబ్బందిని పిలిపించి వీధి దీపాలకు మరమ్మతులు చేయించారు. పాతలైట్ల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేశారు. అనంతరం స్థానికంగా పాదయాత్ర చేపట్టి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బి.భీమ్‌రాజ్, ఆర్.సంతోష్, వాసు, ఆనంద్, రవియాదవ్, రామకృష్ణ తదితరులున్నారు.

సొంత ఖర్చులతో గణేష్ మండపం ఏర్పాటు



ఇందిరానగర్‌లో గణేష్ మండపం

నల్లకుంట: నల్లకుంట సంజయ్‌గాంధీనగర్ బస్తీవాసుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ లక్ష రూపాయల సొంత ఖర్చులతో గణేష్ మండపాన్ని ఏర్పాటు చేయించారు. దీంతో స్థానికులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలు గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు.

ఉపాధి కల్పించడంలో ప్రభుత్వం విఫలం

కాచిగూడ: రాష్ట్రంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో సీఎం కేసీఆర్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు ఆరోపించారు. మంగళవారం బర్కత్‌పురలోని పార్టీ నగర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. యువత మద్దతుతో కేసీఆర్ ప్రభుత్వాన్ని కూలుస్తామన్నారు. కేసీఆర్ నిరంకుశ వైఖరిని నిరసిస్తూ.. బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ఈ నెల 13,14 తేదీల్లో నిర్వహించే ఉపవాస దీక్షను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 17న పరేడ్ గ్రౌండ్‌లో జరిగే అమిత్‌షా బహిరంగ సభలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

కులగణనతోనే సామాజిక న్యాయం

ఉస్మానియా యూనివర్సిటీ: కుల గణనతోనే సామాజిక న్యాయం జరుగుతుందని ప్రొ.యోగేంద్ర యాదవ్ అన్నారు. మంగళవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ పొలిటికల్ సైన్స్ విభాగంలో వామపక్ష, దళిత, బహుజన విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఏ టాక్ ఆన్ వై డు వీ నీడ్ ఏ కాస్ట్ సెన్సెస్ అనే అంశం పై జరిగిన సదస్సు జరిగింది. ప్రొ.చంద్రునాయక్ అధ్యక్షత వహించగా ప్రొ.యోగేంద్ర యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొని జనగణనలో కులగణన ఆవశ్యకత గురించి వివరించారు. చలమల్ల వెంకటేశ్వర్లు, ప్రభంజన్‌యాదవ్, కిరణ్‌గౌడ్ పాల్గొన్నారు.

బహుజనులు రాజ్యాధికారంవైపు పయనించాలి



తెలంగాణ రాష్ట్ర వడ్డెర సంఘం సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్

75 ఏళ్లుగా మోసపోతూనే ఉన్నామన్న ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: స్వాతంత్య్రం వచ్చిన 75 ఏళ్లుగా దళిత, బహుజనులు మోసపోతూనే ఉన్నారని బహుజన సమాజ్ వాది పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. మరోసారి మోసపోకుండా మనఓట్లు మనకే వేసుకుని బహుజనులు రాజ్యాధికారం వైపు పయనించాలని కోరారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర వడ్డెర సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అణగారిన వర్గాల వారిని అణచివేస్తునే ఉన్నారని విమర్శించారు. ఎన్నికలప్పుడే సమావేశాలు నిర్వహించుకోకుండా తమ హక్కుల కోసం పోరాటం చేయాలన్నారు. 99 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఒక శాతం ఉన్న వారికి భయపడుతున్నారన్నారు. అగ్రవర్ణాల్లోని పేదలు కూడా మనకే మద్దతు తెలుపుతున్నారని వివరించారు. 'లక్ష జనాభా లేని వెలమ సామాజిక వర్గానికి 16 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని' విమర్శించారు. '26 లక్షలు ఉన్న వడ్డెరులు ఎప్పుడైనా ప్రగతి భవన్‌కు వెళ్లారా'.. అని ప్రశ్నించారు. ఇప్పటికైనా బహుజనులు కళ్లు తెరిచి రాజ్యాధికారం వైపు పయణించాలని పిలుపునిచ్చారు. మాజీమంత్రి, బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 52 బీసీ కులాలు ఉన్నప్పటికీ నేటికి అనేక కులాలు అసెంబ్లీ, పార్లమెంట్‌లో అడుగు పెట్టలేదని కనీసం సర్పంచ్‌లు కూడా కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలు ఎప్పుడు అడుక్కునే స్థితిలో ఉన్నారే తప్పా.. పోరాడి రాజ్యాధికారాన్ని సాధించుకోవాలనే ఆకాంక్షతో లేరన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ పాలనకు చరమగీతం పాడినప్పుడే బహుజనులకు సముచిత గౌరవం దక్కుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర వడ్డెర సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పల్లపు సమ్మయ్య మాట్లాడుతూ.. వడ్డెరులను షెడ్యూల్ తరగతుల్లో చేర్చాలని వడ్డెర ఫెడరేషన్‌కు అత్యధిక నిధులు కేటాయించాలని, కాంట్రాక్టు పనుల్లో 20 శాతం రిజర్వేషన్ కల్పించాలని, వడ్డెరులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర వడ్డెర సంఘం అధ్యక్షులు నగేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు శివరాత్రి దుర్గయ్య, ప్రధాన కార్యదర్శి గండికోట కృష్ణ, కోశాధికారి బొంత నాగరాజు, గోగుల రమేష్, ఉపాధ్యక్షులు పల్లపు రవీందర్, ఎం.సతీష్, రాపోలు సమ్మయ్య, ఓర్సు తిరుపతి తదితరులున్నారు.

బీసీ బిల్లుపై కేంద్రమంత్రికి వినతి



కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కాచిగూడ: పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, మహిళా విభాగం జాతీయ కన్వీనర్ రమాదేవి డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం మంగళవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని దీనికి రాజ్యాంగ సవరణ చేయాలన్నారు. బీసీల విద్య, ఉద్యోగ రిజర్వేషన్లపై ఉన్న క్రిమిలేయర్‌ను తొలగించాలన్నారు. బీసీల జనాభా ప్రకారం 27 శాతం నుంచి 56 శాతానికి పెంచాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం నేతలు నీలం వెంకటేష్, ఉదయ్ నేత, నిఖిల్, రాజు తదితరులున్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులతో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట్: రాష్ట్రంలో ప్రతి ఇంటికి ప్రభుత్వం సంక్షేమ పథకం అందించి, ప్రజల అభ్యున్నతికి పాటుపడుతుందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. మంగళవారం అంబర్‌పేట మండల పరిధిలో షాదీముబారక్, కల్యాణలక్ష్మి పథకం కింద 206 మంది లబ్ధిదారులకు చెక్కులు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే, కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి, తహసీల్దార్ బిక్షపతితో కలిసి లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా ప్రత్యేక చొరువ తీసుకుంటున్నామన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయంతో ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. బీఆర్‌ఎస్ నేతలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు



తాగునీటి పైపులైన్ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్ పద్మ

అంబర్‌పేట: ప్రజల తాగునీటి అవసరాలకు అనుగుణంగా నియోజకవర్గంలో పైపులైను వ్యవస్థను ఆధునీకరిస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. మంగళవారం బాగ్ అంబర్‌పేట డివిజన్ సీతకాలనీలో రూ.19 లక్షలతో నిర్మించనున్న తాగునీటి పైపులైన్ పనులను స్థానిక కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డితో ఆయన కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దశాబ్దాల కాలం నాటి పైపులైన్లను తొలిగించి దశలవారీగా కొత్త పైపులైన్లను వేయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గంలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. నాయకులు, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, జల మండలి అధికారులు పాల్గొన్నారు.

నోట్‌బుక్స్ పంపిణీ

నల్లకుంట: ప్రముఖ సంఘ సేవకులు కె.దిలీప్‌కుమార్, మురళీధర్‌రావు, టీబీఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.సురేష్ చందర్‌రావుల ఆధ్వర్యంలో విద్యానగర్ టీఆర్టీ కాలనీలోని స్ఫూర్తిబాయ్స్ హోమ్‌లో మంగళవారం సాయంత్రం అనాథ విద్యార్థులకు నోట్‌బుక్స్, స్టేషనరీ సామగ్రిని పంపిణీ చేశారు. శారద, మురళీకృష్ణ తదితరులున్నారు.

ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ చైర్మన్‌కు శుభాకాంక్షలు



డాక్టర్ సుధాకర్‌రావుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ చైర్మన్‌గా నియమితులైన డాక్టర్ సుధాకర్‌రావును ఆరోగ్యమిత్రల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో ఆరోగ్యమిత్రలు ఎదుర్కొంటున్న సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సానుకూలంగా స్పందించి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఆరోగ్య మిత్రల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాదయ్య, ప్రధాన కార్యదర్శి కుమార్, నాగరాజు, బొజ్జనాయక్, లింగస్వామి, రవీందర్, స్వామి, లక్ష్మారెడ్డి, పరశురాములు పాల్గొన్నారు.

విశేష పూజలు

నల్లకుంట: శ్రావణమాసం చివరి మంగళవారం న్యూనల్లకుంట బ్రాహ్మణ హాస్టల్‌లేన్‌లోని శ్రీ వీరాంజనేయ గణపతి దేవాలయం భక్తులతో పోటెత్తింది. ఈ సందర్భంగా అర్చక స్వాములు ఆంజనేయస్వామికి అభిషేకం కావించి సింధూర లేపనంతో అలంకరించి ఆకుపూజలు నిర్వహించి హారతులు ఇచ్చి భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ జరిగింది.

నియామకం

ముషీరాబాద్: ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ త్వరలో జరగబోయే 2023 అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని పలు కమిటీలను నియమించారు. పబ్లిక్ సిటీసెల్ కమిటీలో సభ్యులుగా ముషీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ప్రస్తుత టీపీసీసీ ఉపాధ్యక్షులుగా ఉన్న సంగిశెట్టి జగదీశ్వర్‌రావును నియమించారు.

ఆత్మరక్షణకు కరాటే చక్కటి సాధనం



విద్యార్థులతో చీఫ్ ఎగ్జామినర్ రాపోలు సుదర్శన్

కాచిగూడ: ఆత్మరక్షణ కోసమే కాకుండా ఆరోగ్యానికి 'కరాటే' చక్కటి సాధనంగా ఉపకరిస్తుందని 'జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా' చీఫ్ ఎగ్జామినర్ రాపోలు సుదర్శన్ అన్నారు. హెల్త్ లీగ్ కరాటే కోచ్ దామోదర్ నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం కాచిగూడలోని హెల్త్ లీగ్ క్రీడా మైదానంలో కరాటేలో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. వివిధ విభాగాల్లో అర్హత సాధించిన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలతో పాటు కలర్ గ్రేడింగ్ బెల్టులను ప్రదానం చేశారు. హెల్త్‌లీగ్ జనరల్ సెక్రెటరీ శాంతి స్వరూప్, కరాటే విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులున్నారు.

నిరాహార దీక్షను విజయవంతం చేయాలి

అంబర్‌పేట: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ బీజేపీ నేడు చేపట్టే దీక్షను విజయవంతం చేయాలని బీజేపీ అంబర్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు నాగభూషణంచారి ఆ పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. మంగళవారం డివిజన్‌లోని ఆయన నివాసంలో మాట్లాడుతూ.. ఇందిరాపార్క్ వద్ద చేపట్టనున్న నిరాహార దీక్షకు పార్టీ శ్రేణులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రత్యేక ప్రణాళిక ప్రకటించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మత్స్యకారుల సంక్షేమానికి ప్రత్యేక ప్రణాళికను ప్రకటించాలని తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి లెల్లల బాలకృష్ణ డిమాండ్ చేశారు. అన్ని రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో మత్స్య పరిశ్రమ అభివృద్ధి గురించిన అంశాలను చేర్చాలని కోరారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మత్స్యకార్మిక సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి విస్తృత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. చేపలు, రొయ్య పిల్లల పంపిణీలో కోట్లాది రూపాయల అవినీతి జరిగిందని ఆరోపించారు. మత్స్య సొసైటీ బ్యాంక్ ఖాతాల్లో చేప, రొయ్య పిల్లల కొనుగోలుకు నగదు జమ చేయాలని ఆందోళన చేసిన ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియో, ఇన్సూరెన్సులను చెల్లించాలని కోరారు. సెప్టెంబర్ 25న జిల్లా, అక్టోబర్ 3న నిర్వహించే చలో మత్స్యభవన్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సంఘం అధ్యక్షుడు నర్సింహ్మ, ఉపాధ్యక్షుడు శంకర్, డైరెక్టర్ పద్మ, ముఠా దశరథ్, నాగేశ్వర్‌రావు, వెంకట్ తదితరులున్నారు.

సేవ చేసేందుకు కార్యకర్తలు ముందుకు రావాలి



గజమాలతో సన్మానిస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

చిక్కడపల్లి: సామాజిక సేవ చేసేందుకు నాయకులు, కార్యకర్తలు ముందుకురావాలని బీజేవైఎం నగర మాజీ అధ్యక్షుడు ఎ.వినయ్ కుమార్ అన్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్న వినయ్‌కుమార్‌ను గాంధీనగర్‌లో డివిజన్ నేతలు మంగళవారం రాత్రి గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలుపే ధ్యేయంగా నాయకులు పనిచేయాలన్నారు. కేంద్రప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ.. అర్హులందరూ లబ్ధిపొందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో నేతలు శ్రీకాంత్, సురేందర్, ఉమేష్, ఆనంద్ తదితరులున్నారు.

గతంలో ఉన్నట్లుగానే నాలా ప్రహరీని నిర్మించాలి



ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ముషీరాబాద్: గతంలో ఉన్న మాదిరిగానే హుస్సేన్ సాగర్ నాలా ప్రహరీని నిర్మించాలని దామోదర్ సంజీవయ్యనగర్ (డీఎస్‌నగర్) వాసులు ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. మంగళవారం భోలక్‌పూర్ డివిజన్‌లోని డీఎస్‌నగర్ వరద నీటి నాలా బాధితులు భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ ఉపాధ్యక్షులు శంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శంకర్‌గౌడ్, డీఎస్‌నగర్ బస్తీ అధ్యక్షుడు ఎర్రం నర్సింగ్‌రావు, ఉపాధ్యక్షుడు మల్లేష్, ప్రధాన కార్యదర్శి మహేష్‌లు మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ అధికారులు హుస్సేన్‌సాగర్ నాలా నిర్మించేందుకు తమ ఇళ్లను కూల్చివేస్తామని హెచ్చరిస్తున్నారన్నారు. నాలాను ఆనుకుని వందలాది కుటుంబాలు నివసిస్తున్నాయన్నారు. తమ ఇళ్లకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వరద నీటి నాలా పక్కన నివసించే కుటుంబాల ఇళ్లకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. డీఎస్‌నగర్ బస్తీ నాయకులు లత, రేణుక, శ్యామల, ఎల్లమ్మ, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల పర్మనెంట్‌కు వీసీలు సహకరించాలి



ఆందోళన చేస్తున్న అధ్యాపకుల

ఉస్మానియా యూనివర్సిటీ: కాంట్రాక్టు అధ్యాపకుల ఉద్యోగాల పర్మనెంట్‌కు రాష్ట్రంలోని 12 వర్సిటీల వీసీలు సహకరించాలని తెలంగాణ వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకుల జేఏసీ చైర్మన్ డాక్టర్ పరుశురామ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఓయూ క్యాంపస్ టెక్నాలజీ కళాశాల ప్రవేశ ద్వారం ఎదుట మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన చేపట్టారు. డాక్టర్ ప్రేమయ్య, డాక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొ. ఐలయ్య పరిశోధనకు పేటెంట్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ కాలేజీ ఆఫ్ టెక్నాలజీ కెమికల్ ఇంజినీర్ అధ్యాపకులు ప్రొ.సాదం ఐలయ్య పరిశోధనకు పేటెంట్ లభించింది. తాను డిజైన్ చేసిన కెమికల్ అడల్టేషన్స్ టెస్టింగ్ డివైస్‌కు ఇండియన్ పేటెంట్ దక్కింది. ఓయూ వీసీ, రిజిస్ట్రార్‌తో పాటు కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.చింత సాయిలు, ఇతర అధ్యాపకులు అభినందించారు.

దినసరి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ముషీరాబాద్: గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హోటళ్లల్లో పనిచేస్తున్న దినసరి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్ దినసరి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పాపారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్లో దినసరి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో దినసరి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ.. గత 35ఏళ్లుగా రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో హాస్టళ్లలో చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ టైం స్కేల్, పే స్కేల్ ఇచ్చి అర్హులైన వారందరినీ రెగ్యూలర్ చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో వీఆర్‌ఓలను సర్దుబాటు చేయడం వల్ల గిరిజన ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న దినసరి కార్మికులు రెగ్యులరైజ్ కాకుండా సమస్య మరింత జఠిలమవుతుందన్నారు. 30 శాతం పీఆర్సీ కలుపుతూ.. ప్రతినెల 5వ తేదీ లోగా జీతాలు చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. సెలవులతో కూడిన 12 నెలలకు తప్పకుండా జీతాలు చెల్లించాలన్నారు. విధి నిర్వహణలో మరణించిన వర్కర్ల కుటుంబసభ్యులకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. ఆరోగ్య బీమా సౌకర్యం, హెల్త్ కార్డులను అందజేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

తెన్నేటి సుధ పురస్కారం ప్రదానం



పురస్కారం ప్రదానం చేస్తున్న ప్రముఖులు

చిక్కడపల్లి: వంశీ సంస్థల అధినేతగా 50 ఏళ్లకు పైగా పలు సాంస్కృతిక కళా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు వేగేశ్న దివ్యాంగులు, అనాథ బాలల ఆశ్రమం స్థాపించి వారికి విద్యాబుద్ధులు నేర్పుతున్న వంశీ రామరాజు కళా సేవా రంగాల రాజు అని పలువురు ప్రముఖులు కొనియాడారు. మంగళవారం రాత్రి శ్రీ త్యాగరాయగానసభలో వెగేశ్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో శైలజ సుంకరపల్లి నిర్వహణలో వంశీ రామరాజు 74వ జన్మదినం సందర్భంగా రామరాజు, తెన్నేటి సుధ దంపతులకు ఆదర్శదంపతుల పురస్కారం ప్రదానం జరిగింది. పులువురు గాయనీగాయకులు విదేశాలలో స్థిరపడిన రవి కొండబోలు, మురళి, ప్రసాద్ తోటకూర, దర్శకుడు రేలంగి నరసింహారావు, నిర్మాత రామ సత్యనారాయణ సాంస్కృతిక సంస్థల ప్రముఖులు, జాతీయ వాయిద్య కళాకారుల సంఘం అధ్యక్షులు చిన్నారావు తదితరులు పాల్గొని రామరాజు దంపతులను జీవన సాఫల్య పురస్కారంతో సన్మానించారు.

ఒక్క ఛాన్స్ ప్లీజ్ !

బీజేపీ టికెట్ కోసం 34 మంది దరఖాస్తులు

ముషీరాబాద్: నియోజకవర్గం నుంచి బీజేపీ టికెట్ ఆశిస్తున్న వారు ఈ నెల 4 నుంచి 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర కమిటీ చేసిన విజ్ఞప్తికి కార్యకర్తల నుంచి రాష్ట్ర నాయకుల వరకు స్పందించారు. సుమారు 34 మందికి పైగా టికెట్ కోసం దరఖాస్తు చేసుకోవడం తీవ్ర చర్చనీయాంశమైంది. నగరంలో బీజేపీకి పట్టుఉన్న నియోజకవర్గాలో ముషీరాబాద్ ఒకటి. డాక్టర్ కె.లక్ష్మణ్ దాదాపు 30 ఏళ్ల నుంచి తిరుగులేని నాయకుడిగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఆయన రాజ్యసభ ఎంపీతో పాటు ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడిగా, పార్లమెంట్ కమిటీ, ఎన్నికల సెలక్షన్ కమిటీలో ఉంటూ కీలక నాయకుడిగా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన పోటీచేసే అవకాశం లేనట్లు తెలుస్తోంది. దీంతో నియోజకవర్గానికి ఇబ్బడిముబ్బడిగా దరఖాస్తులు వచ్చాయి. ఎమ్మెల్యే స్థాయికి తగ్గట్లు ఉన్న వారు కొందరైతే.. ప్రచారం కోసం మరికొందరు దరఖాస్తు చేసుకున్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు. పార్టీలో గ్రూప్ తగాదాలు తారాస్థాయికి చేరుకున్నాయని సమాచారం. దీనిని మొగ్గలోనే తుడిచివేసే పరిస్థితి కనిపించడం లేదని వినికిడి. కార్పొరేటర్లు, రాష్ట్ర నాయకులు, సీనియర్ నాయకులతో పాటు దత్తన్న కుమార్తె బండారు విజయలక్ష్మి, ప్రతి ఎన్నికల్లో తెరవెనుక ఉండి వ్యూహరచన చేసే గోపాల్‌రెడ్డి కూడా దరఖాస్తు చేసుకోవడంతో పోటీ తీవ్రంగానే ఉండే అవకాశం కనిపిస్తుంది.

పండుగలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలి



సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ రూపేష్ కుమార్‌తో శరత్‌శ్యామ్

కాచిగూడ: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు, మిలాద్ ఉన్ నబి పండుగలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ రూపేష్‌కుమార్ సూచించారు. బర్కత్‌పుర ప్రాంతానికి చెందిన సెంట్రల్ పీస్ కమిటీ ఈస్ట్ జోన్ అసిస్టెంట్ సెక్రెటరీ ఎన్.శరత్ శ్యామ్ నేతృత్వంలో పీస్ కమిటీ ప్రతినిధులు డీసీపీని మంగళవారం కలిసి పూలబొకే అందజేసి పండుగ ఏర్పాట్లపై చర్చించారు. పీస్ కమిటీ ప్రతినిధులు హఫీజ్ ముజఫర్, సయ్యద్ గజీయుద్దీన్, శ్రీ కిషన్‌శర్మ, ఎస్.నారాయణరెడ్డి పాల్గొన్నారు.

న్యూసెన్స్ కేసులో ఐదుగురికి జైలు

చిక్కడపల్లి: నిబంధనలు ఉల్లంఘిస్తూ.. అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ఐదుగురికి సికింద్రాబాద్ 13వ స్పెషల్ ఎంఎం కోర్టు 4 రోజుల జైలుశిక్ష విధించినట్లు దోమలగూడ ఇన్‌స్పెక్టర్ దొంతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మంగళవారం తెలిపారు. చిల్డ్రన్ పార్క్, బీమా మైదాన్ వద్ద సీరజ్ (20), సోనూపాన్(29), రోమ లీయాదవ్ (31), పంకజ్ కుమార్ (27), బత్తిని ఉదయ్ (35) అనే ఐదుగురు వ్యక్తులు పనివేళల్లో నిబంధనలు ఉల్లంఘిస్తూ.. ప్రజల్లో న్యూసెన్స్ సృష్టిస్తున్న వారిని సికింద్రాబాద్ 13వ స్పెషల్ ఎంఎం కోర్టు 4రోజుల పాటు జైలు శిక్షతో పాటు రూ.50 జరిమానా విధించినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన కైలాస్ లక్ష్మణ్‌గోరే (37)బతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చి కూలిపని చేస్తున్నాడు. మంగళవారం ఉందానగర్ – జూకల్ రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా.. రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.